

**కొరవడిన చెత్తశుద్ధి!**

జీహెచ్ఎంసీ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నది. జుమ్మేరాత్ బజార్‌లో రోడ్డు పక్కన భారీగా పేరుకుపోయిన చెత్తనే ఇందుకు నిదర్శనం.

# ఇరిగేషన్‌లో 231 ఉద్యోగుల విరమణ!


- **మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఉద్యోగ విరమణలు**
- **ఎనిమిది మంది సీఈలు, 35 మంది ఎస్ఈలు..**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సాగునీటి పారుదలశాఖలో రాబోయే మూడు నెలల్లో దాదాపు 231 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరిలో ఇంజినీరింగ్ క్యాడర్ ఉద్యోగులు 100 మందికిపైగా ఉంటారని సమాచారం. ఇందులో ఎనిమిది మంది చీఫ్ ఇంజినీర్లు, 35 మంది సూపరింటెండెంట్ ఇంజినీర్లు, 18 మంది డీఈఈలు రిటైర్ కానున్నారు. వీరితోపాటు నాన్‌టెక్నికల్ విభాగంలో కూడా ఈ ఏడాది 100కుపైగా ఉద్యోగులు విరమణ పొందనున్నారని తెలుస్తున్నది. మార్చిలో కొద్దిమంది విరమణ పొందనుండగా, ఏప్రిల్‌లో ఎక్కువమంది విరమణ పొందనున్నారని సమాచారం. మే లోనూ మరికొందరు విరమణ పొందనున్నారు. వీరిలో ఆనకట్టల రక్షణ, ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్, అంతర్రాష్ట్ర జలమండలి, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ తదితర విభాగాలకు చెందినవారు ఉన్నారు. ఇరిగేషన్ శాఖలో చీఫ్ ఇంజినీర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరకు మొత్తం 2,796 శాంక్షన్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 2,436 మంది పనిచేస్తున్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, సూపరింటెండెంట్, రికార్డ్ అసిస్టెంట్ తదితర విభాగాలకు 2,538 శాంక్షన్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 1,953 మంది ఉన్నారు. రెండింటిలో కలిపి 5,334 శాంక్షన్ పోస్టులకుగాను ప్రస్తుతం 4,389 మంది ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 360, ఇతర విభాగాల్లో 586 మొత్తం 946 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాబోయే మూడు నెలల్లో మరో 231కిపైగా ఖాళీలు ఏర్పడనున్నాయి.

### ఎక్స్‌టెన్షన్‌పై 15మంది అధికారులు

ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందినవారిలో దాదాపు 15 మంది ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్నారు. వీరిలో ముగ్గురు చీఫ్ ఇంజినీర్లు ఉన్నారు. ఇంటర్‌స్టేట్, సీడీవో విభాగాలతోపాటు పలువురు కన్సల్టెంట్లుగా కొనసాగుతున్నారు. వారందరినీ తొలగించాలని ఇప్పటికే సర్వీస్‌లో ఉన్న ఇంజినీర్లు పట్టుబడుతున్నారు. సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఈ మేరకు ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది.

# భారీగా నకిలీ యాంటీబయాటిక్స్ పట్టివేత




హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): నకిలీ యాంటీబయాటిక్స్ విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్న డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు వారి నుంచి రూ. 22.95 లక్షల విలువైన నకిలీ ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఉప్పల్‌లోని ట్రాకాన్ కొరియర్స్‌లో తనిఖీలు నిర్వహించగా ఐదు కార్టన్లలో నకిలీ ఔషధాలు బయటపడినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ నుంచి పువ్వాడ లక్ష్మణ్ పేరుతో అవి వచ్చాయని పేర్కొన్నారు. లక్ష్మణ్‌పై గతంలోనూ ఇలాంటి కేసులు ఉన్నట్టు చెప్పారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని గోదాములో కార్టన్లను డెలివరీ ఇస్తుండగా లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ద్వారకాపురంలో అతడు శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పేరుతో అక్రమంగా గోదాము నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. యూపీ నుంచి వచ్చిన పార్శిళ్లలో హిమాచల్ ప్రదేశ్‌లోని మెగ్ లైఫ్‌సైన్సెస్‌లో తయారైన 'సెఫోక్సిమ్-సీవీ' ట్యాబ్లెట్లు 51 వేలు ఉన్నట్టు గుర్తించామన్నారు. అది కూడా బోగస్ కంపెనీయేనని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బీ లక్ష్మీనారాయణ, కే అన్వేషన్, చంద్రశేఖర్, అనిల్, క్రాంతికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

# సీఎం కార్యదర్శిగా చంద్రశేఖర్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఐఎఫ్ఎస్ అధికారి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ జీ చంద్రశేఖర్ రెడ్డిని ముఖ్యమంత్రి కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో జాయింట్ ఐజీ వేముల శ్రీనివాసులును సీఎం కార్యాలయం ఓఎస్డీగా, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శంకరయ్యను టీఎస్‌టీఎస్ ఎండీగా నియమించారు.

### దేశంలోనే తొలి బీఎస్సీ ఫారెస్ట్రీ ఐఎఫ్ఎస్ అధికారిగా గుర్తింపు

ముఖ్యమంత్రి కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ జీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లావాసి. బీఎస్సీ ఫారెస్ట్ గ్రాడ్యుయేట్‌గా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరిన దేశంలోని తొలివ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. బీఎస్సీ ఫారెస్ట్రీ ఉస్మానియాలో, ఎంఎస్సీ జేఎన్‌యూ న్యూఢిల్లీ, లైఫ్‌సైన్సెస్ ఐఐఎం బెంగళూరులో, పీజీపీపీఎం యూఎస్ఏ సిరక్యూస్‌లో పూర్తిచేశారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్ఆర్‌డీ) ఆధ్వర్యంలో ఇండియన్ సివిల్ సర్వీసెస్ అధికారులకు నిర్వహించిన ఫౌండేషన్ కోర్సులో 580 మంది అధికారులకు శిక్షణ ఇచ్చే కోర్సు డైరెక్టర్‌గా పనిచేశారు. చిత్తూరులో ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్‌గా, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్‌గా మహబూబ్‌నగర్‌లో, నీటి సంరక్షణ మిషన్ అడిషనల్ సీఈవోగా, హెచ్ఎండీఏ ఎన్విరాన్‌మెంట్ సభ్యుడిగా, హైదరాబాద్ సీసీఎఫ్‌గా, ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ వ్యవస్థాపక డీన్‌గా పనిచేశారు. ప్రపంచబ్యాంక్, జైకా, డీఎఫ్ఐడీ నుంచి ప్రాజెక్టులను చేపట్టిన అనుభవం ఉన్నది. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో మూడేండ్లుగా వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

# సింగరేణిని అగ్రగామిగా నిలుపుతాం

## సంస్థ సీఎండీగా బలరాం బాధ్యతలు



హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ)/శ్రీరాంపూర్: సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా నిలపడానికి కృషిచేస్తామని సింగరేణి నూతన సీఎండీ ఎన్ బలరాం చెప్పారు. కొత్త గనులను ప్రారంభించుకోవడంతోపాటు థర్మల్, సోలార్ విద్యుత్తును మరింతగా విస్తరింపజేస్తామని తెలిపారు. నూతన సీఎండీగా ఆయన బుధవారం సింగరేణిభవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణిని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. రక్షణ పట్ల మరింత శ్రద్ధ వహిస్తూ ఖర్చుకు వెనుకాడకుండా చర్యలు తీసుకోనున్నామని పేర్కొన్నారు. సింగరేణిలో ఖాళీ పోస్టులను గుర్తించి భర్తీ చేస్తామని చెప్పారు. సింగరేణి ఈ ఏడాది 700 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాలంటే అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎండీకి పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. సింగరేణి మాజీ డైరెక్టర్ పవిత్రన్‌కుమార్, ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ చైర్మన్, కోల్ ఇండియా డైరెక్టర్ (టెక్నికల్) బీ వీరారెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వరరెడ్డి, ఈడీ జే ఆల్విన్, జీఎంలు సురేశ్, గురవయ్య, సింగరేణి అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రాజశేఖరరావు, అధికారులు, ఉద్యోగులు సీఎండీని కలిసి అభినందనలు తెలిపారు.



# రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలేవి?

- **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రోడ్డు భద్రత చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేయాలన్న పిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు గత ఏడాది మార్చి 29న జారీ చేసిన మార్గదర్శకాలు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని పిల్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. రోడ్డు భద్రత చర్యలు తీసుకోకపోవటంతో మ్యాన్ హోల్స్, డ్రైనేజీలు, రోడ్డు ప్రమాదాల్లో రాష్ట్రం ఎనిమిదో స్థానంలో ఉన్నదని పిటిషనర్ తెలిపారు. వాదనల విన్న హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

# భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు


స్మితా సబర్వాల్


దాసరి హరిచందన


భారతి హోలికెరి


మహేశ్‌దత్ ఎక్కా


సర్వే సంగీత


విష్ణు ఎస్ వారియర్


పీవీ పద్మజ


జోయెల్ డేవిస్

మొదటిపేజీ తరువాయి...

కార్యదర్శిగా ఉన్న స్మితాసబర్వాల్‌ను ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. రాహుల్ బొజ్జా, దాసరి హరిచందనకు రెండు వారాల్లోనే మరోసారి స్థానచలనం కల్పించింది. సీఎంవో కార్యదర్శిగా ఉన్న రాహుల్ బొజ్జాను జీఏడీ కార్యదర్శిగా గత నెల 17న, ఆయుష్ డైరెక్టర్‌గా ఉన్న హరిచందనను ప్రజావాణి నోడల్ ఆఫీసర్‌గా గత నెల 18న ప్రభుత్వం నియమించింది. రెండు వారాల్లోనే మరోసారి బదిలీ చేసింది. ప్రజావాణి నోడల్ ఆఫీసర్‌గా డీ దివ్యను నియమించగా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు జీఏడీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ బాధ్యతలను డీఐజీ రెమా రాజేశ్వరికి ప్రభుత్వం అప్పగించింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న వీవీ శ్రీనివాసరావును టెక్నికల్ సర్వీసెస్ డీజీపీగా బదిలీ చేసింది.

**వీరికి ఇతర శాఖల అదనపు బాధ్యతలు**

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియాకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.
- రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌కు కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావుకు జీఏడీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- పర్యావరణ, అటవీశాఖ కార్యదర్శి ఎం ప్రశాంతికి ఆయుష్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖల ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.
- కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి ఎం హరితకు కో-ఆపరేటివ్ సొసైటీల కో-ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### బదిలీ అయిన ఐఏఎస్ అధికారులు

| ఐఏఎస్ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| మహేశ్‌దత్ ఎక్కా | ఎంసీఆర్‌హెచ్చార్డీ డీజీ | పరిశ్రమలు, గనులశాఖ ముఖ్య కార్యదర్శి |
| మహ్మద్ నదీమ్ | కార్మిక శాఖ కమిషనర్ | ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి |
| రాహుల్ బొజ్జా | జీఏడీ కార్యదర్శి | ఇరిగేషన్ శాఖ కార్యదర్శి |
| స్మితా సబర్వాల్ | సీఎంవో ముఖ్య కార్యదర్శి | ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శి |
| ఏ శరత్ | సంగారెడ్డి కలెక్టర్ | గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి |
| డీ దివ్య | వెయిటింగ్ | ప్రజావాణి నోడల్ ఆఫీసర్ |
| దాసరి హరిచందన | ప్రజావాణి నోడల్ ఆఫీసర్ | నల్లగొండ కలెక్టర్ |
| భారతి హోలికెరి | వెయిటింగ్ | ఆర్కియాలజీ డైరెక్టర్ |
| కే శశాంక | మహబూబాబాద్ కలెక్టర్ | రంగారెడ్డి కలెక్టర్ |
| అద్వైత్ కుమార్‌సింగ్ | సెంట్రల్ డిప్యూటేషన్ | మహబూబాబాద్ కలెక్టర్ |
| చిట్టెం లక్ష్మి | వెయిటింగ్ | డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ |
| కృష్ణ ఆదిత్య | పీసీబీ సభ్య కార్యదర్శి | కార్మికశాఖ డైరెక్టర్ |
| ఆయేషా మస్రత్ ఖానం | పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ | మైనార్టీ గురుకులాల కార్యదర్శి |
| సర్వే సంగీత సత్యనారాయణ | టీఎస్ ఫుడ్స్ ఎండీ | సీఎంవో సంయుక్త కార్యదర్శి |
| వల్లూరు క్రాంతి | జోగులాంబ గద్వాల కలెక్టర్ | సంగారెడ్డి కలెక్టర్ |
| బీఎం సంతోష్ | టీఎస్‌పీఎస్సీ అదనపు కార్యదర్శి | జోగులాంబ గద్వాల కలెక్టర్ |
| అభిలాష అభినవ్ | వెయిటింగ్ | జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ |
| పీ కదిరవన్ | జయశంకర్ భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ | హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ |

### బదిలీ అయిన ఐపీఎస్ అధికారులు

| ఐపీఎస్ అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| వీవీ శ్రీనివాసరావు | పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ | టెక్నికల్ సర్వీసెస్, డీజీపీ |
| గజారావు భూపాల్ | వెయిటింగ్ | కోఆర్డినేషన్ డీఐజీ, డీజీపీ కార్యాలయం |
| రెమా రాజేశ్వరి | సీపీ, రామగుండం | డీఐజీ, ఉమెన్ సేఫ్టీ వింగ్ |
| ఎల్ఎస్ చౌహాన్ | డీఐజీ, జోన్-5 | సీపీ, రామగుండం |
| జోయెల్ డేవిస్ | డీసీపీ, ఎస్బీ | డీఐజీ, జోన్-5 |
| విష్ణు ఎస్ వారియర్ | సీపీ, ఖమ్మం | డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ |
| పీవీ పద్మజ | ఎస్పీ, ఉమెన్ సేఫ్టీ వింగ్ | డీసీపీ, మల్కాజిగిరి |
| జానకీ షర్మిల | డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌పీఏ | ఎస్పీ, నిర్మల్ |
| జానకీ దేవనాథ్ | డీసీపీ, మల్కాజిగిరి | డీసీపీ, సౌత్ ఈస్ట్ జోన్ |
| సునీల్‌దత్ | డీసీపీ, ఈస్ట్ జోన్ | సీపీ, ఖమ్మం |
| రాజేంద్రప్రసాద్ | వెయిటింగ్ | ఎస్పీ, సీఐడీ |
| ఉదయ్‌కుమార్‌రెడ్డి | ఎస్పీ, ఆదిలాబాద్ | ఎస్పీ, ట్రాన్స్‌కో |
| గౌస్ ఆలం | ఎస్పీ, ములుగు | ఎస్పీ, ఆదిలాబాద్ |
| వినీత్ | ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం | డీసీపీ, మాదాపూర్ |
| శబరీశ్ | డీసీపీ, మేడ్చల్ జోన్ | ఎస్పీ, ములుగు |
| నిఖిత పంత్ | వెయిటింగ్ | డీసీపీ, మేడ్చల్ జోన్ |
| బీ అనురాధ | డీసీపీ, రాచకొండ | సీపీ, సిద్దిపేట |
| ప్రవీణ్‌కుమార్ | ఎస్పీ, నిర్మల్ | డీసీపీ, ఎల్బీనగర్ |
| బిరుదురాజు రోహిత్‌రాజు | డీసీపీ, సౌత్ ఈస్ట్ జోన్ | ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం |
| బాలస్వామి | డీసీపీ, సౌత్ వెస్ట్ జోన్ | ఎస్పీ, మెదక్ |
| అశోక్‌కుమార్ | ఓఎస్డీ, ములుగు | ఓఎస్డీ, జయశంకర్ భూపాలపల్లి |
| వెంకటేశ్వర్లు | వెయిటింగ్ | డీసీపీ, ట్రాఫిక్-3, హైదరాబాద్ |
| సీహెచ్ శ్రీనివాస్ | వెయిటింగ్ | డీసీపీ, రాజేంద్రనగర్ జోన్ |

### నాన్ క్యాడర్ ఎస్పీల బదిలీల వివరాలు

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయినస్థానం |
|---|---|---|
| కేసీఎస్ రఘువీర్ | ఎస్పీ (అడ్మిన్) సైబర్ సెక్యూరిటీ బ్యూరో | ఎస్పీ, నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, హైదరాబాద్ |
| బీ శ్రీనివాస్‌రెడ్డి | ఎస్పీ (వెయిటింగ్) | ఏసీబీ జాయింట్ డైరెక్టర్ |
| కే ప్రసన్నారాణి | ఏసీబీ, జాయింట్ డైరెక్టర్ | ఎస్పీ ఇంటెలిజెన్స్ |
| కే శిల్పవల్లి | డీసీపీ అడ్మిన్, హైదరాబాద్ సిటీ | డీసీపీ సైబర్‌క్రైమ్స్, సైబరాబాద్ |
| మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీ | మేడ్చల్, అడిషన్ డీసీపీ | అడిషనల్ డీసీపీ (అడ్మిన్) హైదరాబాద్ సిటీ |
| ఎన్ వెంకటేశ్వర్లు | డీసీపీ ట్రాఫిక్-3 హైదరాబాద్ సిటీ | డిప్యూటీ డైరెక్టర్ టీఎస్‌పీఏ |
| ఎం రవీందర్‌రెడ్డి | ఎస్పీ టీఎస్ ట్రాన్స్‌కో | ఎస్పీ ఇంటెలిజెన్స్ |
| దేవేందర్‌సింగ్ | ఎస్పీ ఇంటెలిజెన్స్ | ఎస్పీ (అడ్మిన్), సైబర్ సెక్యూరిటీ బ్యూరో |
| భాస్కర్ అగ్గడి | ఎస్పీ (వెయిటింగ్) | ఎస్పీ (అడ్మిన్), సైబరాబాద్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో |
| చంద్రమోహన్ గుండేటి | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ టాస్క్‌ఫోర్స్ రాచకొండ |
| కరుణాకర్ పుల్లా | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ ఎస్‌బీ రాచకొండ |
| మనోహర్ కే | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ ట్రాఫిక్ రాచకొండ |
| నర్సింహ కొత్తపల్లి | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ క్రైమ్స్ సైబరాబాద్ |
| రమణకుమార్ ఎం | ఎస్పీ (వెయిటింగ్) | ఏఐజీ లా అండ్ ఆర్డర్ (డీజీపీ ఆఫీస్) |
| సృజన కరణం | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ వుమెన్ సేఫ్టీ, సైబరాబాద్ |
| శ్రీనివాస్ ఎస్ | ఎస్పీ (వెయిటింగ్) | ఎస్పీ సీఐడీ |
| శ్రీనివాస్ డీ | ఎస్పీ (వెయిటింగ్) | డీసీపీ ఎస్ఓటీ, మేడ్చల్, సైబరాబాద్ |
| రాఘవేందర్‌రెడ్డి జే | ఎస్పీ (వెయిటింగ్) | గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్ |
| డీ సునీతారెడ్డి | ఎస్పీ రాచకొండ, నార్కొటిక్స్‌సెల్ | డీసీపీ మహేశ్వరం, రాచకొండ |
| ఆర్ జగదీశ్వర్‌రెడ్డి | డీసీపీ రాజేంద్రనగర్, సైబరాబాద్ | ఎస్పీ సీఐడీ |
| బీ సాయిశ్రీ | డీసీపీ ఎల్బీనగర్, రాచకొండ | డీసీపీ ఈస్ట్‌జోన్, హైదరాబాద్ సిటీ |

# సైన్స్ కాంగ్రెస్ జరిగేనా?

- **రూపాయి విదిల్చలేమన్న డీఎస్టీ**
- **రూ.50 కోట్లు అడిగిన జేఎన్టీయూ**
- **రాష్ట్ర ప్రభుత్వ సహకారమూ అనుమానమే**




హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): శాస్త్రవేత్తలు, సైన్స్ కుటుంబం అంతా ఘనంగా జరుపుకొనే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. వచ్చే నెలలో హైదరాబాద్ జేఎన్టీయూలో జరగాల్సిన 109వ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణపై అనిశ్చితి నెలకొన్నది. దీని నిర్వహణకు కేంద్రం ప్రభుత్వం సహాయ నిరాకరణ చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. కరోనా సమయంలో తప్ప ఏటా ఏటా సైన్స్ నిరాటంకంగా కొనసాగింది. ఈ కాంగ్రెస్ నిర్వహణకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) రూ.5 కోట్లు అందజేస్తుంది. కానీ, ఈ ఏడాది నిధులను ఇవ్వబోమని డీఎస్టీ స్పష్టంచేసింది. 2024లో జరిగే సైన్స్ కాంగ్రెస్‌కు అన్ని రకాల వనరులను నిలిపివేస్తున్నట్టు గత సెప్టెంబర్‌లో ప్రకటించిన కేంద్రం.. తాజాగా మరోసారి పునరుద్ఘాటించింది. సైన్స్ కాంగ్రెస్‌లో చర్చించే అంశాలు (కంటెంట్), కేంద్ర ప్రభుత్వంతో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కున్న విబేధాలే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. నిధుల లేమి, కేంద్రం సహకరించకపోవడంతో ఇప్పటికే ఈ ఏడాది సైన్స్ కాంగ్రెస్‌ను లక్నో వర్సిటీ నిర్వహించాల్సి ఉండగా, అక్కడి నుంచి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీకి మార్చారు. అక్కడా సహకరించే పరిస్థితులు లేకపవడంతో జేఎన్టీయూకు మార్చారు.

### రాష్ట్ర ప్రభుత్వం సహకరించేనా..?

ఈ ఏడాది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం నిర్వహణకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ కార్యక్రమ నిర్వహణకు రూ.50 కోట్లు ఇవ్వాలని జేఎన్టీయూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అటు డీఎస్టీ సహాయ నిరాకరణ చేస్తుండగా, ఇటు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీలైనంత మేరకు ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు, సీఎస్సార్ నిధులను సమీకరించేందుకు జేఎన్టీయూ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌ల కేటాయింపుపై

# పునఃసమీక్ష చేయండి

- **కేంద్రాన్ని ఆదేశించిన హైకోర్టు**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ, ఏపీకి అఖిల భారత అధికారుల కేటాయింపుపై కొనసాగుతున్న వివాదానికి హైకోర్టు తెరదించింది. 10 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌ల కేటాయింపులకు సంబంధించి కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్ ) ఇచ్చిన తీర్పును పక్కకు పెట్టింది. ఆ అధికారుల ప్రస్తుత సర్వీసు, మిగిలిన సర్వీసుతోపాటు వారి వ్యక్తిగత అభ్యంతరాలను వేర్వేరుగా పరిగణనలోకి తీసుకుని కేటాయింపులపై పునఃసమీక్ష చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఆలిండియా సర్వీస్ అధికారుల కేటాయింపు వివాదంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగానికి అప్పగించింది. ఆ అధికారుల వినతిపత్రాలపై కేంద్రం నిర్ణయం తీసుకునే వరకు వారందరినీ ప్రస్తుతం ఉన్న చోట్లే కొనసాగించాలని పేర్కొన్నది. అయితే వారి వినతిపత్రాలపై కేంద్రం నిర్ణయం తీసుకునేందుకు హైకోర్టు ఎలాంటి గడువును విధించలేదు. ఆలిండియా అధికారుల కేటాయింపు నిమిత్తం ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని, తదనుగుణంగానే కేటాయింపులు చేయాలని స్పష్టం చేసింది. 'క్యాట్' ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణను మూసేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ నామారపు రాజేశ్వర్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులు జీ అనంత రాము, ఎం ప్రశాంతి, వాకాటి కరుణ, ఏ వాణీ ప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్, తెలంగాణకు కేటాయించిన హరికిరణ్, జీ సృజన, శివశంకర్ లహోటితోపాటు ఏపీకి కేటాయించిన ఐపీఎస్ అధికారులు ప్రస్తుత తెలంగాణ రోడ్డు భద్రతా మండలి చైర్మన్, మాజీ డీజీపీ అంజనీ కుమార్, అభిలాష బిష్త్, అభిషేక్ మహంతి 'క్యాట్'ను ఆశ్రయించారు. తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కూడా ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫారసులను 'క్యాట్'లో సవాల్ చేశారు. దీంతో ఆ కమిటీ మార్గదర్శకాలను కొట్టేస్తూ 2017లో 'క్యాట్' తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో వేర్వేరు అప్పీళ్లను దాఖలు చేసింది. దీంతో సోమేశ్ కుమార్‌ను ఏపీకి కేటాయిస్తూ కమిటీ చేసిన సిఫారసులను గతంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సమర్థిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును అంజనీ కుమార్‌తోపాటు ఇతర ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకూ వర్తింపజేయాలంటూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై తాజాగా ద్విసభ్య ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది.